
విసుగెత్తి రహశ్యంగా వాళ్ల బావకు వుత్తరం వ్రాయించి అతణ్ణి రప్పించి ఎవరికీ తెలీకుండా వాళ్ల బావతో పల్లెటూరు వెళ్లిపోయిందిట. కనకదుర్గను పెళ్లాడగల సమర్దుడు వాళ్ల బావ వెంకటేశం ఒక్కడే నని తేలిపోయింది, అతణ్ణి చూడగానే. తర్వాత తిరుపతిలో పెళ్లి చేయడానికి వీరాస్వామిరాజా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విన్నాం. ఏమైతేనేం కనకదుర్గ కష్టాలు గట్టెక్కాయి, వాళ్ళ బావ పుణ్యమా అంటూ. యింక మీద అర్ధరాత్రి కరకర చప్పుళ్ళు మాకు వినిపించవు. రోడ్డు రోలరు లాగే అవస్థ కనకదుర్గకు తప్పింది పాపం. "ఎందుకు మీ అమ్మకూ నాన్నకూ చెప్పకుండా యిలా పారిపోయావు" అంటే "ఆ, అలా వెళ్ళకపోతేబావకు నన్నివ్వరుగా! అందుకే బావ వచ్చి నన్నెత్తికెళ్ళిపోయాడు. లేకపోతే ఎవరు లాగుతా రమ్మా ఆ రోడ్డు రోలరు నిద్రలేకుండా!" అంటుంది కనకదుర్గ, బుంగమూతి పెట్టి.





# యక్ష ప్రశ్నలు

'ధర్మరాజా! విను' మంటూ ఆశరీర వాణి ఇలా చెప్పసాగింది.

ఒకప్పుడు, మగధదేశంలో మణిగుప్తుడనే బేహారి ఉండేవాడు. అతని జీవితం చాలా చిత్రమయింది. అతను పుట్టిన కొద్ది గంటలకే తండ్రి చనిపోయాడు. అందరూ అతన్ని దరిద్రజాతకుడనీ, దురదృష్టవంతుడనీ అంటుండేవారు.

వారన్నమాటల్లో అసత్య మేమీలేదు. మణిగుప్తుని తండ్రి గొప్పవ్యాపారస్థుడు. భారత దేశంనుండి, మణులు, మాణిక్యాలు, పట్టువస్త్రాలు, కస్తూరి, పునుగు, జవ్వాజి, కుంకుమ పువ్వు, సుగంధ ద్రవ్యాలు, నింపుకొని అతని ఓడలు రేవులను విడిచిపెట్టేవి. ఆరు నెలలలోగా, మనదేశంలో లభ్యంకాని వస్తువులతో తిరిగి వచ్చేవి. ఈ వ్యాపారంలో మణిగుప్తుని తండ్రి కోట్లకుకోట్లు ఆర్జించాడు. అతని వ్యాపారం ప్రధానంగా, మహారాజులతో, చక్రవర్తులతో జరిగేది. అది కారణంగానే, అతనికి దేశదేశాల రాజుల వద్దా, ఉన్నతాధికారుల వద్దా ఎనలేని పలుకుబడి ఉండేది!

ఇంత భోగభాగ్యాలున్నా,మణిగుప్తుని తండ్రికి సంతులేదు.ఆ విచారం అతన్ని పట్టి పల్లార్చుతూనే ఉన్నది. బిడ్డలకోసం అతను పడరాని పాట్లు పడ్డాడు. చెయ్యరాని వ్రతాలు చేశాడు. ఆఖరుకు ఒక సిద్ధుని వలన, అతని కోర్కె తీరింది! అందుకయినా ఆ సిద్ధుడొక షరతును విధించాడు.

"నాయనా! సిరిసంపదలో, సంతానమో నీ కొక్కటే ప్రాప్త మున్నది!

రావూరి భరద్వాజ

సంతానం కావాలనుకొంటే, సిరిసంపదలుండవు. అవే కావాలనుకొంటే, నువ్వు నిస్సంతుతో మరణిస్తావు నీకేం కావాలి? ఆలోచించుకో", అన్నాడు సిద్ధుడు.

దేవగుప్తునికి ఆలోచించదగిందేమీ కనిపించలేదు, సిరిసంపదలు తనకు ఎటుగూడీ ఉన్నాయి. వాటినుండి పొందే సుఖమేమిటో తను అనుభవించాడు. కానీ ఇవేమీ తనను పున్నామ నరకం నుండి తప్పించవు. అలా తప్పించగలిగిందల్లా సంతానమే! బిడ్డలే లేకపోతే తన వంశవృక్షం ఇంతటితో అంతరించి పోతుంది. తన తదనంతరం, తన పేరు చెప్పుకొనేవారుగూడా ఉండరు. ధనమా! దానిని తను స్వయంగా సంపాదించాడు. తిరిగీ తన చేతుల మీదగానే వ్యయపరుస్తున్నాడు. డబ్బును సంపాదించ వచ్చుగానీ బిడ్డను పొందడమెలా? అందుకనే, తనకు బిడ్డడు కావాలన్నాడు అతను. సిద్ధుడు 'అలాగే' నని దీవించి వెళ్ళాడు.

మణిగుప్తుడు గర్భవాసాన పడినప్పటి నుంచీ, ఆ కుటుంబానికి అన్నీ కష్టాలు ప్రారంభమయ్యాయి. సరుకులు నింపుకొని సముద్రాల మీది కెళ్ళిన ఓడలన్నీ తుఫానులో చిక్కుకొని మునిగిపోయాయి విదేశ రాజులనుండి, భారీ ఎత్తున లాభాలు తీయాలన్న దృష్టితో. దేవగుప్తుడు సరుకులు నింపి పంపాడు. ఓడలు మునిగిపోయాయని తెలిశాక, బాకీదారులు అతన్ని వత్తిడిచేశారు. ఉన్న ఆస్తీపాస్తులన్నీ తెగనమ్మి బాకీలు చెల్లించాడు అతను! అంతలోనే, రాచరికంలోనూ మార్పులు వచ్చాయి. క్రొత్త రాజుకు, దేవగుప్తునిపట్ల సుహృద్భావం లేకపోవడంతో అతనికి మళ్ళీ వ్యాపారం చేసుకోవడానికి అవకాశం లభించనేలేదు.

ఎన్నిచేసినా లాభం ఉండదని తెలిసిగూడా దేవగుప్తుడు మానవ స్వభావాన్ని మానుకొనలేక పోయాడు. అతను చేసిన ప్రతిప్రయత్నమూ వమ్మయిపోయింది. చివరి రోజుల్లో కూడు గుడ్డలకు గూడా నకనక లాడిపోయాడు. అయినా అతను విచారించలేదు. తనకు కొడుకు కలుగుతాడనీ, ఆ కొడుకు తనను ఉద్ధరిస్తాడనీ గంపెడాశలు పెట్టుకొని బ్రతుకును వెళ్ళదీస్తూ ఉన్నాడు. కొడుకు కలిగాడు గానీ, ఆ ఆనందం ఎక్కువ సేపు అనుభవించకుండానే అతను దాటిపొయ్యాడు.

చేత చిల్లిగవ్వలేని తల్లి, మణిగుప్తుడిని పెంచడానికి పడినపాట్లు ఇన్నీఅన్నీ కావు. అసలు విషయం తెలియని తల్లి, తన రాతను పదేపదే నిందించుకొనసాగింది. దుర్భరమైన ఆ కష్టాలను భరించలేక, అనేక సార్లు ఆమె ఆత్మహత్య చేసుకోవాలనిగూడా ప్రయత్నించింది. కానీ తన అనంతరం, కొడుకు ఏమయిపోతాడో నన్న బెంగ, ఆమె నా కార్యంనుండి, ప్రతిసారీ మరల్చుతూ ఉండేది. తన కొడుకు ఏనాటికయినా





ప్రయోజకుడవుతాడనీ, తండ్రిలాగా, కోట్లకుపడగలెత్తుతాడనీ, ఆ తల్లి కలలు కనసాగింది! ఆ మధురాను భూతులతోనే, బ్రతుకుభారాన్ని బరువుగా ఈడ్వసాగింది.

కలవారి ఇళ్ళల్లో చాకిరీచేసీ వంటపనిచేసీ ఆమె మణిగుప్తుణ్ని సాకింది. తను తిన్నా తినకున్నా, కొడుక్కు మాత్రం, ఉన్నంతలో లోటు రానిచ్చేది కాదు. క్రమక్రమంగా రోజులు గడిచిపోయాయి. కొడుకు భాగ్యాన్ని చూడకుండానే ఆమె గూడా దాటిపోయింది.

ఇప్పుడు మణిగుప్తుడు వంటరివాడు. అతన్ని ఆదుకొనేవారు గానీ 'నా' అనేవారుగానీ లేరు. దరిద్రమంటే ఏమిటో అతనికి క్షుణ్ణంగా అర్థమయిపోయింది. కలవారు, లేనివారి పట్ల ప్రదర్శించే వైఖరీ, ఈసడింపూ, తృణీకారమూ, అతని అంతరాంతరాల్లో అగ్నిజ్వాలలను రెక్కొలిపాయి. ప్రపంచంలో ఉన్న సుఖమంతా, ధనవంతులే గుత్తకు తీసుకొన్నారని అతను గట్టిగా నమ్మాడు. డబ్బులేనిదే ఈ ప్రపంచంలో ఏమీ సాధించలేమనీ, ప్రపంచగమనం, ఆర్థికనేమిమీద ఆధారపడి ఉన్నదనీ, అతను భావించాడు. వ్యక్తి గౌరవాగౌరవాలు, అతని వ్యక్తిత్వాన్ని బట్టిగాక, అతని వద్దగల ధనపురాసులను బట్టి నిర్ణయమౌతాయన్న సత్యం అతనికి గాఢంగా ఆకళింపయింది. సుఖపడటానికీ, నలుగురిలో తలెత్తుకు తిరగడానికీ డబ్బే ప్రధానమని తేల్చుకొన్నాడు. సమాజదృష్టి, ధనపురాసులమీద ఉంటుందిగానీ, అది సంపాదించిన మార్గాలమీద ఉండదని గూడా మణిగుప్తుడు నిశ్చయించుకొన్నాడు.

అప్పటినుండే అతను ధనార్జనకు పూనుకొన్నాడు. అనేక పద్ధతు లవలంబించాడు. అనేక మార్గాల ప్రయత్నించాడు. తన ఖర్చులను, అత్యంత కనిష్ఠస్థాయికి తగ్గించుకొన్నాడు. నిద్రాహారాలు మాని, డబ్బును కూడబెట్టసాగాడు. భగవంతుడు గూడా అతనికి తోడు పడ్డాడు. అతను ప్రారంభించిన ప్రతిపనీ దిగ్విజయ మయ్యేది. చేసిన ప్రతిపనికీ. ఇబ్బడి ముబ్బడిగా ప్రతిఫలం ముట్టుతూఉండేది.ఆ రోజుల్లోనే అతను ఓ కోటీశ్వరుని, ఏకైక పుత్రికను పెళ్ళాడాడు. ఆమె ద్వారా నలుగురు బిడ్డలను గూడా కన్నాడు. అయితే ఆ భార్యగానీ, బిడ్డలుగానీ సుఖమంటే ఏమిటో ఎరుగరు. ఉన్న నౌకర్ల నందరనూ తీసి వేశాడు. ఆమేరకు ఆదా చేశాడు. ఇంట్లో రోజూ వంట చేయనిచ్చేవాడు కాదు. ఎంత తక్కువతిని బ్రతకడానికి వీలున్నదో, అంతే మణిగుప్తుడు తినేవాడు. భార్యాబిడ్డలకు గూడా అంతే పెట్టేవాడు. ఉండటానికి మగునిస్తేణి వద్ద కోట్లున్నాయి. కానీ, అందులోంచి గవ్వ తియ్యడానికి లేదు.

సరైన తిండి లేకా, మందులు లేకా, ముందుగా భార్యా, ఆ వెంటనే ఒక్కొక్కరుగా, నలుగురు బిడ్డలూ మరణించారు. ఆ సంఘటనకు మరొకరైతే, వలవలా ఏడవ్వలిసింది! మణిగుప్తుడు ఏడవ లేదు, సరిగదా, అంతో ఇంతో సంతోషించాడు పైగా! వారందరి క్రిందా ఖర్చయ్యే డబ్బు మిగిలి పోతుందన్న భావన, అతన్ని ఆనందంలో ముంచి లేవ నెత్తింది.

ధనార్జన విషయంలో మణిగుప్తుడనుకొన్న దానికి, సరిగ్గా వ్యతిరేకమైన ఫలితం ఎదురయింది. అతననుకొన్నట్టు డబ్బు సుఖాన్నిచ్చే మాట నిజమే! అయితే అందుకు దాన్ని వినియోగించవలసి ఉంటుంది. మణిగుప్తునికి ఆర్జన మీదనే దృష్టిగానీ, వినియోగం గురించి ఏ ఆలోచనా లేదు. అతని అభిప్రాయం ప్రకారం వినియోగదారుడెప్పుడూ ఆర్జించ లేడు. డబ్బు గౌరవాన్నిస్తుందన్న నమ్మకంగూడా అతనిలో సడలిపోసాగింది. అతని దగ్గర కోట్లకు కోట్లు మూలుగుతున్నాయి. కానీ, అతనంటే ఎవరికీ గౌరవం లేదు. అటువంటి పిసినిగొట్టు ఇంతవరకూ భూమండలం మీద పుట్టలేదనీ, ఇక ముందుగూడా పుట్టబోడనీ అందరూ అంటున్నారు. కొంతమంది తెగబడి, మణిగుప్తుని ముఖాన్నే ఈ మాట లనేశారు. డబ్బు మీది కాపీనంతో భార్యా బిడ్డలను, అన్యాయంగా చంపిన హంతకుడన్న మాటలు, పదే పదే ప్రజలనోట వెలువడుతూ ఉండేవి. అతను వీధిలోకి రావడమే ఆలస్యంగా, కొంటెజనం అతని వెంటపడి, గేలిచేసి పారేసేవారు.

మణిగుప్తుడు, చాలా కాలం ఈ అవమానం భరించాడు. ఓర్పుకైనా ఓ హద్దంటూ ఉన్నదిగదా! మణిగుప్తుని ఓర్పు, ఆహద్దునుగూడా దాటిపోయింది. తనెంత కాలమని, ఇలా ప్రజలచేత ఇలా ఈసడింప బడుతూ ఉండాలి? ఉన్నా ప్రయోజన మేమిటి?

ఏమీ లేదని తనకు తానే సమాధానం చెప్పుకొన్నాడు మణిగుప్తుడు. అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకొన్నాడు. తలుపులన్నీ వేశాడు. ఒక్కసారి భగవంతుణ్ణి మనసారా ధ్యానించాడు. గదంతా కలియచూశాడు. కానీ, ఆత్మహత్య చేసుకోదగ్గ సాధన మేదీ ఆ గదిలో లేదు. ఉన్నవల్లా మణిమాణిక్యాలూ, బంగారు నాణేలూనూ! ఆత్మహత్య కవసరమైన సాధనం కొనితెద్దామని బజారుకు బయలు దేరాడు. సాయంత్రం దాకా తిరిగి తిరిగి వట్టిచేతులతోనే మళ్ళా గదికి చేరుకొన్నాడు మణిగుప్తుడు.

* * *

ఇంతవరకూ కథచెప్పి, అశరీరవాణి ధర్మరాజు నిలా అడిగింది:



"రాజా! మణిగుప్తుడు వట్టిచేతులతో ఎందుకు తిరిగి వచ్చాడు? అతనికి బ్రతుకు మీద ఎలాంటి ఆశాలేదు. ఆత్మహత్య చేసుకోవాలన్న అతని నిర్ణయంలో గూడా అనుమానించడాని కేమీ లేదు. చావడానికి అతను సంసిద్ధంగా ఉన్నాడు. అందుకోసం వీధిలోకెళ్ళిగూడా అతను వట్టిచేతులతో తిరిగి రావడానికి కారణమేమిటి?" అన్నది అశరీరవాణి.

ధర్మరాజు క్షణకాల మాలోచించి, ఇలా అన్నాడు:

"మణిగుప్తుడు ఎంత పిసినిగొట్టో మీరు చెప్పనే చెప్పారు. అతని గదిలో, కనీసం తాడుగూడా లేదని మీరన్న మాటలను బట్టి గ్రహించాను. అలాంటి పిసినారి, ఆత్మహత్య కవసరమైన, విషం, కత్తీ, తాడూలాంటి కనీస సాధనాలను డబ్బు బెట్టి ఎలా కొంటాడు? వాటికోసమయినా ఎంతో కొంత డబ్బు వెచ్చించడం ఇష్టం లేకనే అతను వట్టి చేతులతో తిరిగి వచ్చాడు."